క్లుప్తంగా

ఉత్తమ మహిళా ఉద్యోగినుల ఎంపిక



మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కొందుర్గు: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న భారతిని ఉత్తమ మహిళా ఉద్యోగిగా ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. అలాగే, జిల్లేడ్ చౌదరిగూడ మండలం జిల్లేడ్ పంచాయతీ కార్యదర్శి సమతను ఉత్తమ మహిళా ఉద్యోగిగా ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ మహేష్‌బాబు తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరిని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ శాలువా, పూలమాలలతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ఠ వేడుకలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కేశంపేట: మండలంలోని చింతకుంటపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజారోహణం, శివ, నందీశ్వర, నవగ్రహారాధన, కోట మైసమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆంజనేయస్వామి అభిషేకం, హోమాలను గ్రామస్తులు, భక్తులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్వతమ్మ, జంగయ్య, రమేష్, ప్రవళిక, రాజు, స్వర్ణలత, పరమేష్, జ్యోతి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన వంతెన



విరిగిపోయిన వంతెన రక్షణ దిమ్మెలు

కొత్తూరు: మండల కేంద్రం సమీపంలో రైల్వే వంతెనకు ఉన్న రక్షణ దిమ్మెలు విరిగిపోయి ప్రమాదకరంగా మారిందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. నిత్యం ఈ రోడ్డుపై ఆర్టీసీ, స్కూల్ బస్సులతో పాటు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. గత మూడేళ్ల క్రితం ఓ బస్సు దిమ్మెలను ఢీకొట్టడంతో అవి ధ్వంసమైనట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో వంతెనపై నుంచి వెళ్లే వాహనదారులు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన కిందపడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా హోమం



హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

నందిగామ: మండలంలోని వెంకమ్మగూడలో పోచమ్మ, మైసమ్మ దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్పంచ్ రజనీత వీరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున హోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గ్రామంలోని పలువురు దంపతులు హోమం వద్ద కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కేశంపేట: మండలంలోని కొనాయపల్లిలో చాగంటి చెన్నమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేలు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ రూ.5వేలు, గ్రామ ఉప సర్పంచ్ హన్మంత్‌నాయక్, నర్సింహారెడ్డిలు రెండువేల చొప్పున ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ గ్యార సురేష్, జంగయ్య, రవీందర్, నర్సింహ, మహేందర్, అంజయ్య, సత్యం, శివ, రవి, రాములు, చెన్నయ్య పాల్గొన్నారు.

లింగంధనలో..

మండలంలోని లింగంధనలో గడికోట నారాయణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు పలువురు ప్రజాప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్, కృష్ణ, భాస్కర్, శ్రీనివాస్, కృష్ణయ్య, జంగిలయ్య, చిన్న రామస్వామి, పురుషోత్తం, యాదగిరి, నారాయణ పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రతలో దేశానికే ఆదర్శం



చేవెళ్ల: మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

- మహిళా సంక్షేమంలో మహోజ్వలం
- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం

చేవెళ్ల: మహిళల సంరక్షణ, సాధికారత, స్వావలంబన, భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, ఐసీడీఎస్, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలు, బతుకమ్మలు, కోలాటాలు ఆడుతూ ఘనంగా ఈ వేడుకలను నిర్వహించారు. మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు, తల్లీబిడ్డల సంక్షేమమే సమాజ ప్రగతికి తొలి మెట్టు అన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తుల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమానికి సంబంధించి దేశంలోనే విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పిల్లలు, తల్లుల్లో పోషణ లోపం లేకుండా చేయడానికి వివిధ చర్యలు తీసుకోవడడంతో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని చెప్పారు. ఉత్సవాల్లో మహిళలకు న్యూట్రిషన్ కిట్స్ నజరానాను అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం మహిళలకు కల్యాణలక్ష్మి, గురుకులాలు, మహిళా డిగ్రీ కళాశాలలు, విహబ్, ఆసరా పింఛన్‌లు, మహిళల పేరు మీద ప్రభుత్వ ఇండ్లు, స్థలాల పట్టాలు, మహిళా రిజర్వేషన్లు, అత్యున్నత పదవుల్లో మహిళలకు అగ్రస్థానం లాంటివి ఉన్నాయని చెప్పారు. మాతృ మరణాల రేటు 92 నుంచి 43కు తగ్గిపోయిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 30శాతం నుంచి 62శాతానికి పెరిగినట్లు తెలిపారు. కేసీఆర్ కిట్, గర్భిణీలకు కేసీఆర్ న్యూట్రిషన్‌కిట్లు, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మి లాంటి ఎన్నో పథకాలను మహిళల కోసం తీసుకువచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, వైద్యాధికారులు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు, మహిళా సమాఖ్య అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ముఖ్యనాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలకు అత్యంత ప్రాధాన్యత

శంకర్‌పల్లి: రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ మహిళల అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళ సంక్షేమ దినోత్సవం సందర్భంగా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు లేనిది సమాజమే లేదన్నారు. వారిని గౌరవించాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని తెలిపారు. వారు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఆడపిల్లలు ఉన్న కుటుంబానికి కల్యాణలక్ష్మితో అండగా నిలుస్తున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు ఉన్నారు.



శంకర్‌పల్లి: మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న పాపారావు, పాలకవర్గం సభ్యులు



షాబాద్: మహిళా సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్న గామస్తులు

మహిళా సంక్షేమానికి కృషి

షాబాద్: మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చందన్‌వెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వరలక్ష్మి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని చందన్‌వెల్లి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రీషన్, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మి, మహిళా భద్రతకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సమాజంలో సగభాగమైన మహిళల సంక్షేమం, మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం ప్రొత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని నిర్దవెల్లికి చెందిన గుత్తి మమత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం చేయాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కోరగా సీఎం సహాయనిధి నుంచి 2లక్షల 50వేల ఎల్ఓసీని మంజూరు చేయించారు. ఈ చెక్కును రవీందర్ యాదవ్ మంగళవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని అన్నారు. పథకాల అమలులో ఎక్కడ అవినీతికి ఆస్కారం లేదని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశారని వివరించారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఖాజపాష, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఓసీని అందిస్తున్న ఎంపీపీ

భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దు



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

మొయినాబాద్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర సంస్థకు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నవారి పొట్టగొట్టేందుకు ప్రభుత్వం అక్షయపాత్రను తీసుకొచ్చిందన్నారు. అక్షయ పాత్ర సంస్థ ఎక్కడో వండి భోజనాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తుందని.. ఎప్పుడో వండి తీసుకోస్తుండడంతో ఆహార పదార్థాలు పాచిపోయి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వకుండా కార్మికులనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్మికులు సుధా, రహిమాబేగం, భారతమ్మ, ఉమ, శోభ, సావిత్రి, లక్ష్మమ్మ తదితరులు ఉన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

షాబాద్: షాబాద్, నాగర్‌గూడ, సర్దార్‌నగర్, హైతాబాద్, కుమ్మరిగూడ గ్రామాలకు చెందిన చిరువ్యాపారులకు మంగళవారం ఉచితంగా పెద్ద గొడుగులను పంపిణీ చేసినట్లు జీఎంఆర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఎండ, వానాల నుంచి చిరువ్యాపారులకు ఉపశమనం కల్గించేందుకు ఎంపీ రంజిత్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, ప్రాంతాల్లో గొడుగులను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేందర్‌గౌడ్, వెంకటయ్య, మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, ఆంజనేయులు, షాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ముఖరం, కమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గొడుగులు పంపిణీ చేస్తున్న నాయకులు

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: మండలంలోని మధురాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బొమ్ము రంగయ్యగౌడ్, యాదయ్యగౌడ్‌ల తల్లి జంగమ్మ మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గ్రామానికి వెళ్లి జంగమ్మ భౌతిక కాయానికి నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట నాయకులు వంకాయల నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

‘పల్లెప్రగతి’లో వీఓఏలు భాగస్వాములవ్వాలి

ఏపీఎం నగేష్



షాద్‌నగర్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పల్లెప్రగతి దినోత్సవంలో వీఓఏలు భాగస్వాములు కావాలని ఏపీఎం నగేష్ సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం నగేష్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 15న అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెప్రగతి దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ భవనాలు ఎదుట ముగ్గులను వేసేందుకు వీఓఏలు సహకారం అందించాలని సూచించారు. పల్లెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆయా గ్రామపంచాయతీల్లోని పంచాయతీ కార్యదర్శులకు వీఓఏలు సహకారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఏపీఓ అరుణ, వీఓఏలు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు–కుమ్మరిగూడ రోడ్డును పూర్తి చేయాలి

కొత్తూరు: పాత జాతీయ రహదారి నుంచి కొత్తూరు, కుమ్మరిగూడ మీదుగా అక్కివానిగూడ వరకు మంజూరైన రోడ్డు పనులను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గత ఐదేళ్ల క్రితం ప్రారంభమైన రోడ్డు పనులను కాంట్రాక్టర్ కొంత వరకు మాత్రమే చేశాడు. రోడ్డు పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్డును పూర్తి చేయాలని కోరారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం అని పీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 19న నిర్వహించనున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ పుట్టినరోజును పురస్కరించుకొని నిర్వహించే ఈ టోర్నీకి సంబంధించి వాల్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశ భవిష్యత్తు అంతా యువత చేతుల్లోనే ఉందని, యువత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మధు, నియోజకవర్గ అధ్యక్షుడు సుధీర్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ప్రశాంత్, సాబేర్, సుధీర్ నర్సింహ్మా, శ్రీనివాస్, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణ, మెరాజ్, ఉదయ్, మధుసూదన్ రెడ్డి, శివగౌడ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండలంలోని కనకమామిడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ హమునాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనుల సందర్భంగా కనకమామిడితో పాటు పరిసర వ్యవసాయ క్షేత్ర ప్రాంతంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, అయాన్ కాలేజ్, కేఎస్ రాజు కాలేజ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఆరోగ్య వైద్య దినోత్సవం

డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్

చేవెళ్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు(బుధవారం) ఆరోగ్య వైద్య దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం రాక ముందు రాష్ట్రంలో వైద్య సేవల పరిస్థితి, రాష్ట్రం వచ్చిన తరువాత వైద్యసేవల పరిస్థితి ఎలా ఉందో ఈవేడుకల్లో వివరించనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వం తీసుకువచ్చిన గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ పోషకాహార సామగ్రిని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు, చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

‘కంటివెలుగు’తో దృష్టి సమస్యలకు చెక్



శిబిరంలో పరీక్షలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ... అంధత్వ నివారణలో భాగంగా కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందిస్తున్నట్లు వివరించారు. సమస్యలు తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి వైద్యులు పలు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కరుణశ్రీ, నాయకులు దేవేందర్‌యాదవ్, జే.సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇబ్రహీంపల్లిలోని జాజుగుట్టలో గ్రామస్తుల నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాల్లో దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలుగా ఉంటాయని చెప్పారు. దేవాలయాల నిర్మాణాలకు అందరి భాగస్వామ్యం ఉండాలనే ఆలోచనతో విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. తన వంతు సహాయంగా ఈ విరాళం అందించినట్లు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి అన్నారు.



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న అనంత్‌రెడ్డి

రాంచంద్రయ్య కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: రాంచంద్రయ్య కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గత 40 సంవత్సరాలుగా వివిధ దిన పత్రికలకు ఏజెంట్‌గా ఉండి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాంచంద్రయ్యకు నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట రాజేందర్‌గౌడ్, శ్రీను, సత్యనారాయణ, కృష్ణ తదితరులున్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం



వెంకమ్మగూడలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం

- 9వ విడత హరితహారానికి పకడ్బందీగా చర్యలు
- 18 నర్సరీల్లో 1,80,000 మొక్కలు రెడీ

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న హరితహారంతో ఇప్పటికే గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరుస్తోంది. ప్రతి ఏటా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటి వాటిని ఆయా గ్రామ పంచాయతీ సిబ్బంది కాపాడుతున్నారు. దీంతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉంది. ఇప్పటికీ ఎనిమిది విడతల్లో మొక్కలు నాటగా వచ్చే నెలలో 9వ విడత హరితహారం కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 18 నర్సరీలు ఉండగా, చేగూరులో బృహత్ పల్లె ప్రకృతి వనం ఉంది. ఈ నర్సరీల్లో ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు చొప్పున 180000 వేల మొక్కలను పెంచుతున్నారు. ఇందులో కానుగ, చింత, మునగ, కర్జూరా, వేప, దానిమ్మ, జామ, రావి,నీలగిరి, గోరింటాకు, కరివేపాకు, నేరడు, పతంగీ తదితర మొక్కలు ఉన్నాయి.

19న నాటేందుకు ముమ్మర ఏర్పాట్లు..

ఎనిమిదో విడత మండలంలో 80 వేల మొక్కలను నాటాలని లక్ష్యం పెట్టుకొని అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 19న హరితహారం కార్యక్రమం ప్రారంభం కానుండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో వెయ్యి మొక్కల చొప్పున నాటనున్నారు.

కంటికి రెప్పలా కాపాడుతున్నాం



నర్సరీల్లోని మొక్కలను కంటికి రెప్పాలా కాపాడుతున్నాం. ఈ నెలలో హరితహారం కార్యక్రమం ఉన్నందున అందుకు తగ్గట్లుగా అధికారులు సూచన మేరకు పనులు చేస్తున్నాం, నర్సరీలో జామ, మునగ, కానుగ, రావి, నేరడు, వేప, దానిమ్మ,చింత తదితర 20 రకాలైన మొక్కలు ఉన్నాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా నీరును పెట్టడం, ఎరువులు వేయడం తదితర పనులు చేస్తున్నాం.

–కాట్న కృష్ణయ్య, వన సేవకుడు,నర్సప్పగూడ

లక్ష్యం నెరవేరుస్తాం..



9వ విడత హరితహారం కార్యక్రమం లో భాగంగా మండలంలో 60 వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకు తగ్గ ఏర్పాట్లు కూడ సిద్ధం చేశాం. ఈ నెలలో19న దశాబ్ది ఉత్సవాలలో మొక్కలు నాటడం ప్రారంభిస్తాం. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు యువకులను భాస్వాములను చేసి విజయవంతం చేస్తాం.

–బాల్‌రెడ్డి, ఎంపీడీఓ, నందిగామ